క్లుప్తంగా

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



దాసుతండాలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని రేగులతండాలో ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోతు హరిప్రియ బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక రామాలయం వద్ద ప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేశారు. హరిసింగ్ తల్లిదండ్రులకు ఎమ్మెల్యే దంపతులు పాదాభివందనం చేసి దాసుతండాలో ఎన్నిక ప్రచారం ప్రారంభించారు. స్థానిక మహిళలు ఆమెపై పువ్వులు చల్లుతూ హారతి ఇచ్చి స్వాగతం పలికారు. దాసుతండాలో అన్ని వీధులూ కలియతిరిగారు. వచ్చే ఎన్నికల్లో తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గతంలో ఎవరూ చేయని అభివృద్ధి పనులు చేశానని, ఏ గ్రామానికి వెళ్లినా తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందని, ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. యువజన కాంగ్రెస్ ఇల్లెందు నియోజకవర్గ అధ్యక్షుడు ఇస్లావత్ సాయి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాడు.

సుజాతనగర్‌లో...



పార్టీ కార్యాలయంలో నాయకులు

సుజాతనగర్: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. రెడ్డెం తులసిరెడ్డి, బత్తుల వీరయ్య, మండె వీర హనుమంతరావు, భూక్యా రాంబాబు, పెద్దమళ్ల నరేందర్, లావుడ్యా సత్యనారాయణ, శ్యాంరెడ్డి, వేములపల్లి సత్యనారాయణ, ఇస్తారయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కృష్ణంరాజు

ఇల్లెందురూరల్: ఆర్టీసీ పలు రూపాలలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్ ఆఫీసర్ కృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ఇల్లెందు డిపో ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా విద్యార్థులకు, వికలాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందిస్తున్నామని, బస్ కాంట్రాక్టు, ప్రయాణికులకు లక్కీ డ్రా బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోట ఆపడం జరుగుతుందన్నారు. సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మెట్టెల శిరోమణి, పీఏసీఎస్ ఛైర్మన్ మెట్టెల కృష్ణ, కార్యదర్శి రజియాబేగం పాల్గొన్నారు.

రాష్ట్రానికి విముక్తి కలిగించండి..



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చుంచుపల్లి: మండల పరిధిలోని ధన్‌బాద్ పంచాయతీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబ పాలన నుంచి త్వరలో రాష్ట్రానికి విముక్తి కలగబోతోందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ వర్గంలోని ప్రజలు ఎడవల్లి అభ్యర్థిత్వాన్ని బలపర్చాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఓదయ్య, శంకరయ్య, బొమ్మిడి మల్లికార్జున్, పల్లపు వెంకటేశ్వర్లు, సూరి, నారాయణ, శ్యామ్, కుమార్, ఇస్మాయిల్, గౌస్, నరేష్, సల్మాన్, డానియల్, రెహమాన్, డేవిడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచికి ప్రతీక దసరా



సింగరేణి(కొత్తగూడెం): విజయదశమి వేడుకల్లో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

విజయదశమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజులుగా జరిగిన నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో, ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను ఆచరించారు. మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల ప్రతిమలను భక్తుల కోలాటాలు, భజనలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ఆలయాల వద్ద పాలపిట్టను దర్శించుకొని శమీ పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అమ్మవారి ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధ పూజలు జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల ప్రాంగణాల్లో సాయంత్రం రావణ దహనం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: వీరబ్రహ్మం గుడి వీధిలో అమ్మవారి శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న కోరం కనకయ్య



కొత్తగూడెంఅర్బన్: వేడుకలకు హాజరైన భక్తులు



కొత్తగూడెంఅర్బన్: రావణ దహనం



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో దుర్గామాత



దసరా వేడుకల్లో మాట్లాడుతున్న సింగరేణి కొత్తగూడెం జనరల్ మేనేజర్ శాలెంరాజు





సుజాతనగర్‌లో శమీ పూజ.., దుర్గామాతకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



టేకులపల్లి రామాలయం వద్ద శ్రీ రాజరాజేశ్వరీదేవి అవతారంలో అమ్మవారు







జూలూరుపాడు: శమీ పూజ నిర్వహిస్తున్న దృశ్యం, పాపకొల్లు శివాలయం పూజారి శర్మకు సన్మానం, గుండెపుడిలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవే లక్ష్యం..

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రజలు తనకు దైవంతో సమానమని, తనను ఇంతటి వాడిని చేసిన వారి రుణం తీర్చుకోలేనిదని, ఊపిరి ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేయటం లక్ష్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు.

మంగళవారం ఆయన లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ, అంబేద్కర్‌కాలనీ, హమాలీ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, సాటివారిగూడెం ప్రజలను కలుసుకుని మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రోత్సాహంతో ఐదేళ్లలో రూ.మూడు వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ అంతర్గత రోడ్లు, శ్మశాన వాటికలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కరోనా సమయంలో 60 వేల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి కష్టకాలంలో ప్రజలకు కాపాడుకున్నామని తెలిపారు. తనను మరోసారి ఆదరించాలని, మీ అమూలమైన ఓటు కారు గుర్తుకే వేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, బత్తుల వీరయ్య, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతోనే నా రాజకీయ శేష జీవితం..



మాట్లాడుతున్న రవీంద్రనాయక్

ఇల్లెందు: ఒకనాడు బంజారాలను ఎస్టీలో కలిపేందుకు తన శక్తినంతా ధారపోశాని, అదే పట్టుదలతో ఇల్లెందు ప్రజలతో మమేకమై వారి విద్య, వైద్యం, ఉపాధి కోసం పాటుపడుతానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డి.రవీంద్ర నాయక్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ శేష జీవితం ఇల్లెందు ప్రజలతో కొనసాగిస్తానని తెలిపారు. బంగారు తెలంగాణ అంటూ ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇల్లెందు లాంటి బొగ్గు గనుల ప్రాంతాన్ని బొందల గడ్డగా మార్చాడని విమర్శించారు. ఒక నూతన ప్రాజెక్టు కూడా తీసుకురాలేదన్నారు. సీతారామా ప్రాజెక్టు ఈ ప్రాంతానికి అవసరమని, రానున్న కాలంలో తాను గెలిస్తే సీతారామా ప్రాజెక్టును సాధిస్తానని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం కృషి చేస్తానని చెప్పారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒక దఫా ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా పని చేసిన తాను రాష్ట్రం కోసం ఎంతో చేశానని, తన పని తీరును గమనించిన అధిష్టానం ఇల్లెందు టికెట్ కేటాయించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ ఆగమైపోయిందన్నారు. కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారని, మోదీ, అమిత్ షా, నడ్డా, కిషన్‌రెడ్డిల బాటలో పయనించి అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతోందన్నారు.

ఇల్లెందు ప్రజలకు క్షమాపణ చెప్పండి



మాట్లాడుతున్న మంగీలాల్‌నాయక్

టేకులపల్లి: గతంలో ఇల్లెందు నియోజకవర్గంలో రెండుసార్లు పర్యటించిన కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎన్నికల జిమ్మిక్కులు చేస్తూ మళ్లీ ఇల్లెందుకు రాబోతున్న సీఎం కేసీఆర్ ఇల్లెందు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య కూడా క్షమాపణ చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి భూక్యా మంగీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... టేకులపల్లి మండలంలో కేఓసీ3 ప్రాజెక్టును సింగరేణికి రాకుండా కేసీఆర్ బీజేపీతో కుమ్మక్కై ప్రైవేట్‌కు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇల్లెందులో భూగర్భ గనులు ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. సీతారామ ప్రాజెక్టు కూడా ఇల్లెందుకు రాకుండా వేరే ప్రాంతానికి మళ్లించారని తెలిపారు. భద్రాచలం రాములవారి ఆలయానికి ఇచ్చిన హామీ కూడా నేటికీ అమలు కాలేదని, భద్రాద్రి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. నవంబర్ 1న ఇల్లెందుకు వస్తున్న కేసీఆర్‌ను అడ్డుకోవాలని ఇచ్చిన హామీలు నెర్వాలని డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. దేవా నాయక్, నర్సయ్య, రవీందర్‌సింగ్, ధర్మా పాల్గొన్నారు.

ఘనంగా హీరో ప్రభాస్ పుట్టినరోజు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో హీరో ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అసోసియేషన్ సభ్యులు కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు చేతుల మీదుగా పవన్‌కల్యాణ్ అభిమాని గువ్వల సత్తికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పాల రాధాకృష్ణరెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎల్.సంతోష్, సభ్యులు ఎస్‌కె.జానీ, ఎస్‌కె.మహబాబ్, టి.అనిల్, ఎల్.నరేష్ పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉన్నవారికే మద్దతు



మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

పాల్వంచ: గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు హుస్సేన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు హరినాయక్ అన్నారు. మంగళవారం స్థానిక బంజారా భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు భద్రు నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. జీఓ నంబర్ 3ని యథావిధిగా కొనసాగించాలన్నారు. గిరిజనులను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారని విమర్శించారు. తండాలను గ్రామపంచాయతీలుగా సాధించిన ఘనత సేవాలాల్ సేన సంఘానిదే అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో గిరిజన సమస్యలు ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్నట్లు మారాయన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనుల డిమాండ్లను ఏ పార్టీ పరిష్కరిస్తుందని హామీ ఇస్తుందో వారికే తమ మద్దతు ఉంటుందన్నారు.

రాజేందర్ తీరుతో పార్టీకి నష్టం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: దసరా ఉత్సవాలలో తన మీదకు తనతో ఉన్న కౌన్సిలర్ల మీదకు దాడికి యత్నించిన దిండిగల రాజేందర్ తీరు ప్రజలు గమనిస్తున్నారని, ఎవరి పాత్ర ఎమిటో కార్యక్రమానికి హాజరైన వారికి అర్థం అవుతుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాలు ప్రారంభమైన తరుణంలో ఎమ్మెల్యే హరిప్రియ ఉత్సవాలలో పాల్గొనేందుకు రాగా ఆ సమయంలో వారి ఆహ్వానం మేరకు తాము స్టేజీ మీదకు వచ్చామని తెలిపారు. కేవలం తమ పాలకవర్గ సభ్యులు ఫొటో సెషన్ ముగించుకుని కమిటీ నిర్వహణకు అప్పగించి వెళ్తామని కౌన్సిలర్లను ఆహ్వానించినట్లు చెప్పారు. దాన్ని సహించలేని దిండిగల ఇక్కడ నీ పెత్తనం ఏంటని దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. తన స్థాయి మరిచి వ్యవహరించిన దిండిగల తీరు ఎమ్మెల్యే హరిప్రియ కూడా చూసిందన్నారు. శకుని పాత్ర పోషించే దిండిగల తీరు పార్టీకి నష్టం తెస్తుందని, అధిష్ఠానం ఆలోచన చేయాలని కోరారు. కౌన్సిలర్లు వార రవి, కటకం పద్మావతి, అజమ్, వీణ, లక్ష్మి నవీన్ తదితరులు ఉన్నారు.

ఉత్సవ కమిటీని అభాసుపాలు చేసే యత్నం



మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

ఇల్లెందు: నిన్నటి బతుకమ్మ ఉత్సవాలు, నేటి దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతుంటే తన పేరు మసకబారిపోతుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కమిటీని అభాసునాలు చేసేందుకు ప్రయత్నించటం దుర్మార్గమని జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్ ఆరోపించారు. మంగళవారం ఇల్లెందులో విలేకరులతో మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలలో ఏర్పాట్లు సరిగా లేవన్నట్లు ప్రచారం చేయబోయాడని తెలిపారు. పిలవని పేరంటంలా స్టేజీ మీదకు ఎక్కి పదేపదే మున్సిపాలిటీ చేయటం లేదంటూ ప్రేక్షకులకు వివరించేందుకు పడరాని పాట్లు పడ్డాడని విమర్శించారు. రాత్రి జరిగిన విషయాన్ని అక్కడే వదిలేయకుండా సోషల్ మీడియాలో పోస్టు చేయించాడని, తనపై అక్కసు వెళ్లగక్కాడని వాపోయారు.

ఉసూరుమనిపించిన దసరా వేడుకలు

ఇల్లెందు: ఈ ఏడాది ఇల్లెందులో దసరా ఉత్సవాలకు అన్ని ఆటంకాలే. ప్రతి ఏటా ఫారెస్టు గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు, మిషన్ స్కూల్ గ్రౌండ్‌లో జమ్మి ఉత్సవాలు జరిపేవారు, కానీ గ్రౌండ్‌లు లేకపోవటంతో గత ఏడాది నుంచి జేకేలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఉత్సవాలు ఉండవని ప్రచారం జరిగింది. మున్సిపల్ పాలకవర్గం స్థానంలో ఉత్సవ కమిటీ పేరుతో తక్కువ సమయంలో సాధారణ ఏర్పాట్లు చేశారు. జేకే సింగరేణి స్కూల్ గ్రౌండ్‌కు సింగిల్ గేట్ ఉంది. గత ఏడాది ఒకచోట గోడను తాత్కాలికంగా గేట్ పరిమాణంలో తొలగించి రద్దీ తగ్గించారు. ఈసారి అలాంటి ఏర్పాట్లు చేయలేదు. గ్రౌండ్‌లో స్క్రీన్ ఎత్తు పెంచకపోవటంతో వెనుక నిలబడిన వారికి స్టేజీ మీద జరిగే కార్యక్రమాలను తిలకించే అవకాశం లేకుండా పోయింది. ఇక జమ్మి పూజలు, పాలపిట్ట తిలకించేందుకు భక్తుల రద్దీ మేరకు సదుపాయాలు కల్పించలేదు. రోడ్లు బ్లాక్ కావటం ట్రాఫిక్ జామ్ కావటం వల్ల దుర్గామాత రథాలు గ్రౌండ్‌లోకి రాలేకపోయాయి. ఇదిలా ఉండగా ఉత్సవాలు తిలకించేందుకు విచ్చేసిన వీక్షకులను ఆకట్టునే స్థాయిలో మ్యూజికల్ నైట్, ఆటపాటలు అలరించలేదు. దీంతో గ్రౌండ్ లోకి వచ్చిన వారు అతి తక్కువ సమయంలోనే ఇంటిదారి పట్టారు. ఇక గ్రౌండ్‌లో కుర్చీలు కూడా సరిపడా వేయలేదు. మంచినీటి సదుపాయం కల్పించలేదు. ట్రాఫిక్ జామ్ కారణంగా గేట్‌లో గంటల కొద్ది రద్దీ పెరిగింది. తోపులాట జరిగి నలుగురు క్రిందపడి గాయాల పాలయ్యారు.

ఆకట్టుకోని సాంస్కృతిక కార్యక్రమాలు...

ఈసారి దసరా ఉత్సవాలు ఆకట్టుకునే స్థాయిలో జరగలేదని స్థానిక ప్రజలు చెప్పుకుంటున్నారు. సంబురాలకు వచ్చిన వారిని గంటసేపు గ్రౌండ్‌లో నిలబెట్టే స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేకపోయారని గుసగుసలాడుకుంటున్నారు. ఏం జరిగిందో ఏమో.. కానీ, మిమిక్రీ కార్యక్రమాలు, పాటలు ఆకట్టుకోలేకపోయాయి. పట్టణంలోని వివిధ బస్తీల నుంచి తరలి వచ్చిన విగ్రహాలు గ్రౌండ్‌లోకి వచ్చే ప్రత్యేక మార్గం లేకపోవటంతో రోడ్డు మీదనే నిలిపివేశారు. రథాలన్నీ శోభాయాత్రగా గ్రౌండ్‌కు చేరుకుని ప్రత్యేక పూజలతో వీడ్కోలు అందుకుని నిమజ్జనానికి వెళ్లాల్సి ఉండగా అందుకు తగిన ఏర్పాట్లు జరగలేదు. సింగరేణి జేకే స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన దసరా ఉత్సవాలలో రావణ వధ, జమ్మి పూజ, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు జరిగాయి. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, రంగనాథ్, సుధీర్‌తోత్లా, కొక్కు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పట్టణ, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సింగరేణి గ్రౌండ్‌లో ఉత్సవాలు తిలకిస్తున్న ప్రజలు

ఏర్పాట్లు సరిగా చేయలేదు



మైసూర్ తరహాలో ఇల్లెందులో జరిగే మినీ మైసూర్ దసరా ఉత్సవాలు ఈసారి ఆకట్టుకోలేదు. ఏర్పాట్లు కూడా ఆశించినంతగా చేయలేదు. ఆటపాటా, మిమిక్రీ, లైటింగ్, గ్రౌండ్‌లో ఏర్పాట్లు, రథాలకు స్వాగతం పలకటం లేకుండా పోయింది. ట్రాఫిక్‌ను అదుపు చేసేవారు కరువయ్యారు. గ్రౌండ్‌కు ఒక్కటే గేట్ ఉండటం వల్ల ట్రాఫిక్ ఇబ్బంది కలిగింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారికి నిరాశే మిగిలింది.

– పులి సైదులు, ఇల్లెందు

రథాలకు స్వాగతం పలికే వారే లేరు..



తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి ఎంతో వ్యయప్రయాసాలకు ఓర్చి విగ్రహాలు ఏర్పాటు చేసుకుని రథాలతో అమ్మవారిని తరలించుకుని వచ్చే వారికి గ్రౌండ్‌లో స్వాగతం పలికే వారు కూడా లేరు. మున్సిపల్ పాలకవర్గం స్థానంలో ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసినప్పటికీ ఆశించినంతగా చేయలేకపోయారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనాలు కదల లేదు. రథాలతో తరలి వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉత్సవాల ప్రత్యేకతలు కోల్పోయే ప్రమాదం కనిపించింది.

– కటకం పద్మావతి, 2వ వార్డు కౌన్సిలర్, ఇల్లెందు